క్లుప్తంగా

ఉర్దూ పాఠ్య పుస్తకాల కొరతను తీర్చండి



డీఈఓకు వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): ఉర్దూ పాఠశాలల్లో పాఠ్యపుస్తకాల కొరతపై శనివారం జిల్లా విద్యాశాఖ అధికారి సుధాకర్‌రెడ్డికి రియాసతి ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ నాయకులు వినతి పత్రం అందజేశారు. రూటా జిల్లా కార్యదర్శి దస్తగిరి మాట్లాడుతూ పాఠ్యపుస్తకాల కొరతతో ఉర్దూ చదివే పిల్లలపై తీవ్ర ప్రభావం పడుతుందని తెలిపారు. టెస్ట్ బుక్ డిపో మేనేజర్ భారతితో మాట్లాడి రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తానని ఈ సందర్భంగా డీఈఓ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సైఫుల్లా, జానీబాషా, సలాం, హనీఫ్, జక్రియ, అలీఖాన్, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించండి



ఎల్లావత్తుల గ్రామ సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ

రుద్రవరం: వివిధ పనుల మీద గ్రామ సచివాలయాలకు వచ్చే వారికి మెరుగైన సేవలు అందించాలని డీఎల్‌డీఓ మురళీకళ్యాణి అన్నారు. మండల పరిధిలోని కోటకొండ, ఎల్లావత్తుల, శ్రీరంగాపురం గ్రామ సచివాలయాలను శనివారం ఆమె తనిఖీ చేశారు. ఆయా గ్రామ సచివాలయాల్లో హాజరు పట్టిక, వివిధ రకాల రికార్డుల నిర్వహణ, ఫిర్యాదులు, దరఖాస్తులు, పరిష్కారం వంటి వాటన్నింటిపై ఆరా తీశారు. అనంతరం ఆమె ప్రజలకు అందించాల్సిన సేవలపై సచివాలయ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఉద్యోగి నిర్ణీత సమయానికి విధుల్లో ఉండాలని ఆదేశించారు.

గురుప్రసన్నకు అండగా ఉంటాం

చాగలమర్రి/నంద్యాల(అర్బన్): చిన్నవంగలి గ్రామంలో మట్టి మిద్దె కూలిన ఘటనలో తల్లిదండ్రులు, తోబుట్టువులను కోల్పోయి అనాథగా మిగిలిన బాలిక గురు ప్రసన్న సంరక్షణ, విద్య విషయంలో అండగా ఉంటామని రాష్ట్ర న్యాయ శాఖ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్, ఎంపీ బైరెడ్డి శబరి శనివారం వేర్వేరు ప్రకటనలో హామీ ఇచ్చారు. ఒకే కుటుంబంలో నలుగురు చనిపోయిన ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పందించి ప్రభుత్వం తరఫున ప్రసన్న పేరుతో రూ.10 లక్షలు డిపాజిట్ చేయడంతో పాటు వృద్ధురాలైన బాలిక నాన్నమ్మకు రూ.2 లక్షలు సాయం అందించాలంటూ ఆదేశాలు జారీ చేశారన్నారు.

కేసు నమోదు

బొమ్మలసత్రం: జిల్లా కేంద్రం నంద్యాలలో శుక్రవారం జరిగిన రౌడీషీటర్ సాయికుమార్ హత్యపై పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడి భార్య శైలజ శనివారం తాలుకా పోలీసులను కలిసి తన భర్తను రౌడీషీటర్ సంజీవతో పాటు మరి కొంత మంది కలిసి హత్య చేశారని ఫిర్యాదు చేసింది. ఈ మేరకు సంజీవపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

25 వేల క్యూసెక్కుల నీరు విడుదల

పాములపాడు: మండలంలోని బానకచెర్ల క్రాస్ రెగ్యులేటరు నుంచి 25 వేల క్యూసెక్కుల నీటిని శనివారం విడుదల చేసినట్లు ఏఈ దేవేంద్ర తెలిపారు. శ్రీశైలం వెనుక జలాలను పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరు నుంచి ఎస్‌ఆర్‌ఎంసీ ద్వారా 25 వేల క్యూసెక్కుల నీరు బానకచెర్ల క్రాస్ రెగ్యులేటరుకు వచ్చి చేరుతుందన్నారు. ఈ నీటిలో తెలుగుగంగ(వీబీఆర్)కు 15,000 క్యూసెక్కులు, జీఎన్‌ఎస్‌ఎస్‌కు 9,000 క్యూసెక్కులు, కేసీసీ ఎస్కేప్ చానల్‌కు 1000 క్యూసెక్కుల చొప్పున గేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

అలరించిన నృత్య ప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శనివారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళా వేదికపై విజయవాడకు చెందిన జె.రామచంద్రమూర్తి బృందం వారిచే సంప్రదాయ నృత్య ప్రదర్శన నిర్వహించారు. మహాగణపతి, శివశివ శంకరా, నమఃశివాయతే, భో శంభో తాండవ నృత్యం, అఖిలాండేశ్వరి తదితర గీతాలకు పి.ఆర్.మురళీకృష్ణ, లాస్యశ్రీ, ధృతి, రూపేక్ష, భవజ్ఞ, రేవంతి, వెంకటేశ్వర్లు, షణ్ముఖి తదితరులు నృత్య ప్రదర్శనతో ఆకట్టుకున్నారు.

వీబీఆర్‌లో 8 టీఎంసీల నీరు

వెలుగోడు: తెలుగు గంగ అంతర్భాగమైన వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లోకి కృష్ణా జలాలు వచ్చి చేరుతున్నాయి. శనివారం వీబీఆర్‌లో 8.615 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఏఈ శివనాయక్ తెలిపారు. బానకచెర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి లింక్ చానల్ మీదుగా వీబీఆర్‌లోకి 17150 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా మద్రాస్ కాల్వకు 16 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. వన్ ఎల్ ద్వారా 30 క్యూసెక్కులు, వన్ ఆర్ ద్వారా 50 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. వీబీఆర్ పూర్తి సామర్థ్యం 16.32 టీఎంసీలు కాగా వీబీఆర్‌లోకి 8 టీఎంసీలు రావడంతో సగం రిజర్వాయర్ నిండినట్లు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బడిలో మోగిన ఎన్నికల గంట

- ఎస్‌ఎంసీ ఎన్నికల ప్రకటన విడుదల
- 5న అభ్యంతరాల స్వీకరణ
- ఎనిమిదో తేదీన ఎన్నికలు
- అదే రోజు సభ్యులు, చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌ల ఎన్నిక
- నంద్యాల, ఆళ్లగడ్డలోని 429 స్కూళ్లలో ఏర్పాటు కానున్న కొత్తగా కమిటీలు



ఆళ్లగడ్డ వైపీపీఎం ప్రభుత్వ ఉన్నత పాఠశాల



ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో విద్యాశాఖాధికారులు

ఆళ్లగడ్డ: ప్రభుత్వ రంగ విద్యాసంస్థల్లో ఎన్నికలకు నగారా మోగింది. గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన పేరెంట్స్ మానిటరింగ్ కమిటీల స్థానంలో పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్‌ఎంసీ)ల ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. ఈనెల 1వ తేదీన నోటిఫికేషన్ వెలువడటంతో ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఎన్నికల ప్రక్రియను ప్రారంభించారు. జిల్లాలో మొత్తం 1355 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఇందులో నంద్యాల, ఆళ్లగడ్డ నియోజకవర్గాల్లోనే 429 పాఠశాలలు ఉన్నాయి. వీటన్నింటిలో ఈనెల 8న ఎస్‌ఎంసీ ఎన్నికలు జరగనున్నాయి.

ఎన్నికలు జరిగే విధానం

పాఠశాలల నోటీసు బోర్డుల్లో ఇప్పటికే ఓటర్ల జాబితాను ప్రదర్శించారు. ఈ జాబితాపై ఏవైనా అభ్యంతరాలుంటే ఈనెల 5వ తేదీ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు అభ్యంతరాలను స్వీకరిస్తారు. అనంతరం 3 నుంచి 4 గంటలకు తుది జాబితాను ప్రదర్శిస్తారు. ఈ నెల 8వ తేదీ ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎస్‌ఎంసీ సభ్యుల ఎన్నికల జరుగుతుంది. మధ్యాహ్నం 1.30 గంటలకు చైర్మన్, వైస్ చైర్మన్లను ఎన్నుకుంటారు. 2 గంటలకు ఎస్‌ఎంసీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేస్తారు. అనంతరం 3 నుంచి 3.30 వరకు కమిటీ మొదటి సమావేశం జరుగుతుంది.

50 శాతం తల్లిదండ్రులు వస్తేనే ఎన్నిక

అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాల్లో ప్రాధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో ఎస్‌ఎంసీలు ఏర్పాటు చేయాలి. ఎన్నికలకు 50 శాతం విద్యార్థుల తల్లిదండ్రులు, సంరక్షకులు హాజరుకావలి. కోరం తుక్కువగా ఉంటే అవసరమైతే సమయాన్ని హెచ్‌ఎం పెంచుకోవచ్చు. కాని 50 శాతం కన్నా ఓటర్లు తక్కువగా హాజరైతే ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉండదు.

చేతులు ఎత్తే విధానం

చేతులు ఎత్తే విధానం, నోటి ద్వార తెలపడం తదితర పద్ధతులతో ఎస్‌ఎంసీ సభ్యుల, చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక జరుగుతుంది. ప్రత్యేక పరిస్థితుల్లో మాత్రం రహస్య ఓటింగ్ జరిపే అవకాశం ఉంటుంది.

ఒక్కరికే ఓటు వేసే హక్కు

విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఒక్కరికే ఓటువేసే హక్కు ఉంటుంది. ఎస్‌ఎంసీకి ఎన్నికైన సభ్యుల్లో చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్‌లను ఎన్నుకుంటారు. వీరిలో ఒకరు బీసీ వర్గానికి చెందిన వారై ఒకరు మహిళై ఉండాలి.

ఎన్నికలకు అంతరాయం కలిగించేవారిపై చర్యలు

పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికల్లో రాజకీయ జోక్యం ఉండకూడదు. ఎన్నికలకు అంతరాయం కలిగించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటారు. తహసీల్దార్, ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శి, వీ ఆర్వో పరిశీలకులుగా ఎన్నికల ప్రక్రియలో పాల్గొనవచ్చు

నిబంధనలు ఇవే..

- ప్రతి తరగతికి ముగ్గురు సభ్యులను ఎన్నుకోవాలి.
- వీరిలో కనీసం ఇద్దరు మహిళలు, ఒకరు తప్పక ఎస్సీ/ ఎస్టీ/ పీహెచ్‌సీ అయి ఉండాలి
- మరొకరు బీసీ/ ఈబీసీ/ మైనార్టీ వర్గాలకు చెందిన వారై ఉండాలి
- కమిటీకి అదనంగా ఆరుగురు ఎక్స్ అఫిషియల్ సభ్యులు ఉంటారు. వీరిలో సంబంధిత పాఠశాల హెచ్‌ఎం, మహిళా విభాగం నుంచి సీనియర్ టీచర్, కౌన్సిలర్/ వార్డు మెంబర్, అంగన్‌వాడీ టీచర్, ఫిమేల్ మల్టీపర్పస్ హెల్త్‌వర్కర్, గ్రామైక్య సంఘం అధ్యక్షులు ఉంటారు.

నంద్యాల, ఆళ్లగడ్డ నియోజకవర్గాల్లో ఎస్‌ఎంసీ ఎన్నికలు జరగనున్న పాఠశాలలు, ఓటర్లు

మండలం	మొత్తం స్కూళ్లు	ఓటర్లు
దొర్నిపాడు	29	2068
శిరివెళ్ల	42	5092
ఉయ్యలవాడ	32	2196
చాగలమర్రి	47	5460
రుద్రవరం	56	4605
ఆళ్లగడ్డ	68	5305
నంద్యాల	115	16,251
గోస్పాడు	40	3,709

పటిష్టంగా ఎన్నికల నిర్వహణ



పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్‌ఎంసీ) ఎన్నికల నిర్వహణకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. కలెక్టర్ పర్యవేక్షణలో ఈ ఎన్నికలను సమర్థంగా నిర్వహించేందుకు మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులకు అవసరమైన ఆదేశాలు జారీ చేశాం. ఈ నెల 8న ఎస్‌ఎంసీ ఎన్నికలు, అదే రోజు చైర్మన్, వైఎస్ చైర్మన్ ఎన్నిక, ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహిస్తాం. ఈ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలి.

–సుధాకర్‌రెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి

ఐఎల్‌ఏ న్యాయవాదుల నూతన కార్యవర్గం ఎన్నిక



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

నంద్యాల(వ్యవసాయం): ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ నంద్యాల జిల్లా కార్యవర్గం ఎన్నికను శనివారం రెవెన్యూ భవన్‌లో నిర్వహించారు. ఐఎంఏ స్టేట్ కమిటీ ప్రెసిడెంట్ శాంతకుమార్, బ్రహ్మేశ్వరరావు, రాయలసీమ డిస్ట్రిక్ట్ లీడర్ చంద్రుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా నూతన గౌరవాధ్యక్షుడిగా తిరుపతి, అధ్యక్షుడిగా శ్రీనివాసులు, వైస్ ప్రెసిడెంట్‌లుగా సాంబశివుడు, షాజహాన్, జనరల్ సెక్రటరీగా చిన్నలింగమయ్య, జాయింట్ సెక్రటరీలుగా శ్రీనివాసులు, బాలునాయక్, ట్రెజరర్‌గా పాములేటిని ఎన్నుకున్నారు. అనంతరం న్యాయవాదులకు నూతన క్రిమినల్ చట్టాలపై అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం న్యాయవాదుల సంఘాలను సంప్రదించకుండానే నూతన చట్టాలను తీసుకొని రావడం సరికాదన్నారు. కొత్త చట్టాలపై ప్రభుత్వమే న్యాయవాదులకు శిక్షణ ఇవ్వాలని వారు కోరారు.

క్రైం కార్నర్

వివాహిత ఆత్మహత్యాయత్నం

రుద్రవరం: మండల పరిధిలోని శ్రీరంగాపురం గ్రామానికి చెందిన దేవి అనే వివాహిత శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు ఆమె, భర్త శ్రీనివాసులు కూలీ పనులతో జీవనం సాగిస్తున్నారు. కుటుంబ ఆర్థిక పరిస్థితులపై భార్యాభర్తల మధ్య అప్పుడప్పుడు వాగ్వాదాలు జరిగేవి. ఇందులో భాగంగానే శనివారం జరిగిన చిన్న వాగ్వాదంతో మనస్తాపానికి గురైన ఆమె ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడిపోయింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే గాజులపల్లెలోని ఓ వైద్యశాలకు తరలించి వైద్యం చేయించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు వారు తెలిపారు.

బిడ్డకు తల్లిపాలు బలం



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): బిడ్డకు తల్లిపాలు ఎంతో బలాన్నిస్తాయని ఐసీడీఎస్ నంద్యాల అర్బన్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ నజీర తెలిపారు. పట్టణంలోని దేవనగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శనివారం తల్లిపాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డ పుట్టిన ఆరు నెలల వరకు తల్లిపాలు అందించాలని, ఆరు నెలల తర్వాత మాత్రమే బిడ్డకు అనుబంధ ఆహారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సుజాత, వైద్యులు సుమిత్ర, గర్భవతులు, బాలింతలు, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

శిరివెళ్ల: యర్రగుంట్ల గ్రామ సచివాలయంలో శనివారం నిర్వహించిన తల్లి పాల వారోత్సవాల్లో ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్ సువర్ణలత హాజరై మాట్లాడారు. తల్లి పాల ప్రాముఖ్యతను గర్భిణులు, బాలింతలకు వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గోస్పాడు: తల్లిపాలతో చిన్నారులకు రోగ నిరోధక శక్తి పెంపొందుతుందని వైద్యాధికారి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని తేళ్లపురి, పసురపాడు గ్రామాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కుమారి ఆధ్వర్యంలో తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సెక్యూరిటీ గార్డ్‌లకు కనీస వేతనం అమలు చేయాలి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏసురత్నం

నంద్యాల(న్యూటౌన్): ప్రభుత్వ మెడికల్ కళాశాలలో పని చేస్తున్న సెక్యూరిటీ గార్డ్‌లకు కనీస వేతనం అమలు చేయాలని, మౌలిక సదుపాయాలు కల్పించి ఈఎస్‌ఐ, పీఎఫ్ అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏసురత్నం, నాగరాజు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. బాలయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ప్రభుత్వాసుపత్రి, మెడికల్ కళాశాలల్లో పని చేస్తున్న సెక్యూరిటీ గార్డ్‌ల నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా నాగరాజు, గౌరవ సలహాదారుడిగా బాలవెంకట్, సెక్యూరిటీ గార్డ్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బాలకయ్య, కార్యదర్శిగా చెన్నయ్య, కోశాధికారిగా నాగన్న, సహాయ కోశాధికారిగా సుమలత, ఉపాధ్యక్షులుగా రమేష్ బాబు, సురేఖ, ఆదినారాయణ, హైమావతితో పాటు 22మందిని కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వారు తెలిపారు.

నోటీస్ బోర్డు

ఐటీఐ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలో మూడో విడత ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్ శనివారం శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ఈనెల 26వ తేదీలోపు iti.ap.gov.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఈనెల 27వ తేదీ సాయంత్రం 5గంటల్లోపు తమ సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేసుకోవాలన్నారు. 29వ తేదీన ప్రభుత్వ ఐటీఐలో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలన్నారు. పది పాస్, ఫెయిల్ అయిన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. నూనెపల్లెలోని హెచ్‌పీ పెట్రోల్‌బంక్ ఎదురుగా ప్రభుత్వ ఐటీఐ కాలేజీ ఉన్నట్లు ఆయన తెలిపారు.

సీపీఎం విరాళాల సేకరణ

నంద్యాల(న్యూటౌన్): కేరళలో వరద బాధితులను ఆదుకునేందుకు సీపీఎం నాయకులు శనివారం నంద్యాల పట్టణంలో విరాళాల సేకరణ చేపట్టారు. పట్టణ కార్యవర్గ సభ్యులు మహమ్మద్‌గౌస్, తోటమద్దు మాట్లాడుతూ వయనాడ్‌లో వరదలు, కొండచరియలు విరిగిపడటంతో ఆస్తి, ప్రాణ నష్టం భారీగా జరిగిందనానరు. వారిని ఆదుకునేందుకు తమ వంతుగా విరాళల సేకరణకు శ్రీకారం చుట్టామన్నారు. కార్యక్రమంలో నాయకులు సుబ్బారావు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

శ్రీశైలానికి పోటెత్తిన సందర్శకులు

- ఎక్కడికక్కడ నిలిచిపోయిన వాహనాలు



డ్యాం మార్గంలో నిలిచిపోయిన వాహనాలు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం డ్యాం గేట్లు తెరవడంతో చూసేందుకు సందర్శకులు పోటెత్తడంతో ఆ సరిసర ప్రాంతాల్లో శనివారం ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సుమారు నాలుగు కిలోమీటర్ల మేర రోడ్లపై వాహనాలు నిలిచిపోయాయి. ఆదివారం సెలవు రోజు కావడంతో శనివారం వందలాది వాహనాల్లో భక్తులు, యాత్రికులు శ్రీశైలం చేరుకున్నారు. డ్యాం 10 రేడియల్ క్రస్ట్ గేట్లు తెరవడంతో కృష్ణానది సొబగులు చూడడానికి సందర్శకులు డ్యాం పరిసరాల్లో వాహనాలు నిలిపి ఫొటోలు దిగారు. దీంతో ట్రాఫిక్ జాం అయ్యింది. ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు ఆ ప్రాంతంలో పోలీసులు లేకపోవడంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయి శ్రీశైలం చేరుకునే భక్తులు ఇబ్బందులు పడ్డారు.

చెరువు కట్టపై గండి



కొండమాయపల్లె చెరువు కట్టపై పడ్డ గండి

- కుంగిన తూము
- భయాందోళనలో కొండమాయపల్లె గ్రామస్తులు

రుద్రవరం: మండల పరిధిలోని కొండమాయపల్లె చెరువు కట్టపై సొరంగంలా గండి పడి ప్రమాదకరంగా మారింది. ఆ గండి కూడా ఆయకట్టు పొలాలకు నీరు పారే తూము వద్ద పడింది. ప్రస్తుతం చెరువులో నీరు అరకొరగా ఉంది. నీటి నిల్వ పెరిగితే తూముతో సహ చెరువు కట్ట తెగి నీరు గ్రామంలోకి వచ్చే అవకాశం ఉందని స్థానిక ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ప్రస్తుతం తెలుగుగంగ కాల్వలో నీరు పారుతోంది. ఆ నీరు చెరువుకు ఒకటి రెండు రోజుల్లో చేరనుంది.ఆ లోపే గండిని పూడ్చాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయంపై చిన్న తరహ నీటి పారుదల శాఖ డీఈ గురుమూర్తిని వివరణ అడగ్గా గండి పడ్డ విషయం తమ దృష్టికి రాగానే వెళ్లి పరిశీలించామని ఆదివారం గండి పూడ్చిస్తామని తెలిపారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

- కూలిన ఇంటిపైకప్పు దంతెలు

దొర్నిపాడు: మండలంలోని కొండాపురం గ్రామంలో మాబుహుసేన్, మాబ్బి దంపతులు పెద్ద ప్రమాదాన్ని తప్పించుకుని ప్రాణాలను కాపాడుకున్నారు. శనివారం తెల్లవారు జామున వారు ఇంట్లో నిద్రిస్తుండగా ఇంటిపైకప్పు దంతె విరిగి పడింది. వెంటనే అప్రమత్తమైన వారు బయటకు పరుగులు తీసి ఇరుగుపొరుగు వారిని పిలిచారు. దంతె పొరపాటున మంచంపై పడి ఉంటే ఇద్దరు ప్రాణాలకు ముప్పు వాటిల్లేదని గ్రామస్తులు తెలిపారు. ఈవిషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ మాధవీలత, వీఆర్‌ఓ రాధమ్మ ఇంటిని పరిశీలించారు. భారీ వర్షాల కారణంగా మట్టిమిద్దెలు కూలుతున్నాయని అధికారులు స్పందించి మట్టి మిద్దెలకు పరిహారం ఇవ్వాలని సర్పంచ్ కోరారు.

పామాయిల్ సాగు లాభసాటి



పామాయిల్ మొక్కలు నాటుతున్న నంద్యాల జిల్లా ఉద్యాన శాఖ అధికారి నాగరాజు

మిడుతూరు: పామాయిల్ సాగు రైతులకు లాభసాటి అని జిల్లా ఉద్యాన శాఖ అధికారి నాగరాజు అన్నారు. శనివారం మండల పరిధిలోని రోళ్లపాడు గ్రామంలో అయిల్ పామ్ సాగును సందర్శించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నందికొట్కూరు డివిజన్‌లో త్రి ఎఫ్ ఆయిల్ పామ్ కంపెనీకి ఎంపిక చేయడం జరిగిందని,ఈ డివిజన్‌లో 50 హెక్టార్లు ఆయిల్ పామ్ సాగు చేశారని చెప్పారు. రైతులకు ఒక హెక్టార్‌కు రూ. 29 వేల చొప్పున మూడు సంవత్సరాల వరకు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఉద్యాన అంతర సంటలు సాగు చేసేందుకు ఒక హెక్టార్‌కు రూ. 5,500 అందిస్తామని చెప్పారు. ఆసక్తి గల రైతులు ఉద్యాన అధికారులు, రైతు సేవా కేంద్రాలు, త్రీ ఎఫ్ ఆయిల్ కంపెనీ ప్రతినిధులకు సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారి తేజస్విణి, వీహెచ్‌ఏ ప్రత్యూష, ఎంపీఈఓ కిశోర్, హెచ్‌ఈఓ సురేష్, జోనల్ అధికారి వెంకటప్రసాదు, ఏరియా మేనేజర్ నాగరాజు , రైతులు పాల్గొన్నారు.

స్నేహమేరా జీవితం!



స్నేహం.. ఈ పదం ఆత్మీయం.. అనిర్వచనీయమైంది. స్పందించే గుండె ఉండాలే కాని స్నేహం అనే పదం మహోన్నతమైంది. బంధుత్వం కన్నా ఒక్కోసారి రక్త సంబంధం కన్నా స్నేహ బంధమే విడదీయనిది. నిజమైన స్నేహం త్యాగాన్నే కోరుకుంటూ సహాయానికే నిలువెత్తు సాక్షిగా నిలుస్తుంది. కడగండ్ల జీవితంలో మోముపై చిరునవ్వుకు కారణమయ్యేది ఈ స్నేహమే. కారుచీకట్లు ముసురుకుంటున్న వేళ.. కాంతిరేఖగా వెలుగు పంచేవాడు 'స్నేహితుడు'. సరదాల కుర్ర ప్రాయానికి మరిన్ని తీపి సొబగులు అద్దేవాడు ఫ్రెండ్. ఆస్తుల్లేని యువత ఉండొచ్చు కానీ దోస్తుల్లేని వారు ఉండటం చాలా అరుదు. కాలాలెన్నీ మారినా.. కలకాలం నిలిచి ఉండేది స్నేహం. నేడు 'స్నేహితుల దినోత్సవం'. పలువురు స్నేహితులు తమ స్నేహానుభూతులను ఇలా పంచుకున్నారు.

–నంద్యాల(సిటీ/న్యూటౌన్/అర్బన్)

● ఆ నలుగురు..



చిత్రంలో కనిపిస్తున్న ఈ నలుగురి మధ్య 35 ఏళ్లుగా స్నేహం కొనసాగుతోంది. ఇందులో ఒకరు లలితాసరస్వతి ప్రైవేటు కళాశాల లెక్చరర్ కాగా, ఎం.శంకర్ ఓ కార్పొరేట్ స్కూల్ హెచ్‌ఎం, రామసుబ్బయ్య ప్రముఖ న్యాయవాది, సత్యం అనే మరో వ్యక్తి కాంట్రాక్ట్ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ నలుగురు ఉద్యోగ, కుటుంబ విషయాలు ఒకరికొకరు చర్చించుకుంటూ పరిష్కరించుకుంటున్నారు. మూడు దశాబ్దాల స్నేహంలో తమ మధ్య రహస్యమనేది లేదని వారు చెబుతున్నారు.

● కరాటేతో బలపడిన బంధం..



1999లో చెన్నైలో కరాటే శిక్షణకు కర్నూలు నుంచి ఆరిఫ్ హుసేన్, నంద్యాల నుంచి నూర్‌బాషా వెళ్లారు. వీరు శిక్షణలో బలపడిన బంధం నేటికి కొనసాగుతోంది. ఇరువురు 25ఏళ్లుగా కరాటే శిక్షణ ఒకరినొకరు గౌరవించుకుంటారు. కరాటే శిక్షణలో ఏ చిన్న సమస్య వచ్చినా ఒకరినొకరు కలిసి చర్చించుకొని పరిష్కరించుకుంటారు. కష్ట సుఖాల్లో ఒకరికొకరు చేదోడు వాదోడుగా ఉంటూ తోటి క్రీడాకారులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

● బీజాపూర్‌లో మొదలైన స్నేహం



ఈ చిత్రంలో కనిపిస్తున్న వీరు ఇద్దరూ డాక్టర్లే. ఎడమ వైపు ఉన్న వ్యక్తి నంద్యాల మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకిరెడ్డి, కుడి వైపున ఉన్న వ్యక్తి డాక్టర్ ఎం.శ్రీధర్‌రెడ్డి డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ, జడ్చర్ల. 1990లో బీజాపూర్‌లో ఎంబీబీఎస్ చేసే సమయంలో మొదలైన వీరి స్నేహం నేటికీ కొనసాగుతూనే ఉంది. ఇరువురు రోజుకు ఒకసారైనా పలకరించుకోకుండా ఉండలేరు. తమ స్నేహంలోని ఆప్యాయతను, అనురాగాలను పిల్లలకు సైతం పంచుతున్నట్లు డాక్టర్ అంకిరెడ్డి చెప్పారు.